# కిస్ విద్యార్థులకు గర్వకారణం

## భగవాన్ మహావీర్ అవార్డుకు ఎంపిక పట్ల అచ్యుత్ సామంత్





కిస్ ప్రధాన భవనం

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: ఆదివాసీ బాలలకు ఉన్నత విద్య చెప్పించి వారిని ప్రయోజకులనుచేసి రాష్ట్రంలో దారిద్ర్యాన్ని నిర్మూలించడమే తమ లక్ష్యమని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ (కిస్) విద్యా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ అచ్యుత్ సామంత్ పునరుద్ఘాటించారు. భగవాన్ మహావీర్ అవార్డుకు ఈ సంస్థ ఎంపికైన సందర్భంగా బుధవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. గౌరవప్రదమైన అవార్డుకు ఎంపికైనందుకు ఎంతో ఆనందంగా ఉందని, మరింత ప్రోత్సాహం లభించిందని సామంత్ వ్యాఖ్యానించారు. కొండకోనల్లో విద్యకు దూరంగా ఉన్న గిరిజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు 1993లో 125మంది విద్యార్థులతో ఈ సంస్థ ప్రారంభించాం. నేడు 16,500 మంది విద్యార్థులు ఉచితంగా కేజీ నుంచి పీజీ వరకు చదువుకునేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. విద్యార్థులకు భోజనం, దుస్తులు, పాఠ్య పుస్తకాలు, సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా క్రీడలపై శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారు చేస్తున్నామని చెప్పారు. ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. కిస్‌లో ప్రతిభావంతులైన విద్యార్థులకు కిట్ యూనివర్శిటీలోని వైద్య, ఇంజినీరింగ్ కళాశాలల్లో 5శాతం రిజర్వేషన్లు కల్పించి ఉచితంగా ఉన్నత విద్య చదువుకునే సౌకర్యాలు కల్పిస్తున్నామని అచ్యుత్ సామంత్ పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కిస్ శాఖలు ఏర్పాటు చేస్తూ గిరిజన విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దుతూ వారికి ఉద్యోగ సౌకర్యాలు కల్పించడమే సంస్థ లక్ష్యమని తెలిపారు. భగవాన్ మహావీర్ అవార్డుకి ఎంపిక కావడంతో కిస్ సిబ్బంది, విద్యార్థులు గర్వపడుతున్నారని అన్నారు. అయిదేళ్ల వయసున్న గిరిజన బాలలను తీసుకొచ్చి వారికి ఉచితంగా విద్యా సౌకర్యాలు కల్పిస్తూ క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వం గలవారిగా తీర్చిదిద్దుతున్నామని సామంత్ తెలిపారు. సంస్థకు ఇదివరకే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించిందని చెప్పారు. దేశవిదేశాలకు చెందిన ప్రముఖులు ఈ సంస్థను సందర్శిస్తూ మరింత ప్రోత్సహిస్తున్నారని అన్నారు. సమాజానికి అత్యున్నతసేవలందిస్తున్న వ్యక్తులు, సంస్థలకు భగవాన్ మహావీర్ ఫౌండేషన్ ఏటాఅవార్డులు ప్రకటిస్తుంది. ఈ ఏడాది సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎమ్.ఎన్.వెంకటాచలయ్య నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ 260 నామినేషన్లు పరిశీలించి సంస్థలు, వ్యక్తుల పేర్లను వెల్లడించింది. ఇందులో కిస్‌కి స్థానం లభించింది.